స్వయంకృతాపరాధము

శ్రీమతి కె. యస్. రాధామణిగారు

సీతమ్మ అప్పుడప్పుడే పురాణశ్రవణాన్నుంచీవచ్చి యింటితాళముతీసి లోపల సంజదీపాలు వెలిగించి హాల్లో పడకకుర్చీలో పడుకొని దీర్ఘంగా ఆలోచిస్తూంది. ఎంత ఆలోచించినా ఆ యాలోచనకు అంతేలేదు. ఇంతలో పొరుగింటిస్నేహితురాలు రుక్మిణమ్మ వచ్చి

"ఏమే! సీతా! యింతపొద్దయింది వంటాగింటా ఏమీ లేకుండాఉన్నావు?"

"ఎంత మహోవంట! యిద్దరికి! అప్పుడే సాయింత్రేచేసిపెట్టే పురాణానికొచ్చింది."

"ఏమి మరి అట్లా యోచిస్తున్నావు."

"ఏమియోచనలా! వినలేదా పురాణం చెప్పుతూన్న బ్రాహ్మడు 'అపుత్రస్యగతిర్నాస్తి' అని వివరించిచెప్పింది. ఏడేండ్లకుపైగాఅయింది కాపురానికొచ్చి యింతవరకూ అథమూలా ఉభయమూలా ఏడేండ్లు గర్భిణికానివాండ్లు గొడ్రాళ్లేఅంటారు. దీన్నిగురించే యోచిస్తున్నా."

"అదా సంగతి! అయితే నీభర్తను రెండోపెళ్లి చేసికొమ్మను అప్పుడైనా కలగదేమో."

"అబ్బ నేనుండగానే."

"ఏమీ! ఉండగానే చేసుకునేవాళ్లు లేరా? మనపక్కవీధి రామావధాన్లు రెండోపెళ్లి చేసుకో లేదా రెండోపెళ్లాము లలితమ్మ మగబిడ్డను ప్రసవించ లేదా మనకండ్లెదుటనే."

"అయితే నన్నిప్పు డేమి చేయమంటావు."

"ఇంకో సంబంధము యేర్పాటుచేయించు. నీవు ఒప్పుకుంటే నీ మొగుడు వద్దంటాడా! ఇంతకూ నీచెల్లెలు జానకుందికదా ఎదిగింది."

ఇంతలోనే వసారామెట్లమీదనుండి పెద్దగా జోళ్ళ చప్పుడు విన

ఇంతలోనే వసారామెట్లమీద తొక్కినట్లు శబ్దము వినపడింది. "మీయజమాన్లు వస్తున్నారు" అని రుక్మిణమ్మ పక్కదుతొలిగి వెళ్లిపోయింది.

సీతమ్మ భర్త రామరావు బళ్లారిలో తాలూక కచ్చేరిలో గుమాస్తా. స్కూల్ఫైనలువరకు విద్య చెప్పించినంక తల్లిదండ్రులు గతించారు. అప్పట్లో గుమాస్తాగిరికి చాలా ఖాళీలువుండేవి. అందుకని శీఘ్రంగా రామారావుకు పనిదొరికింది. కొంత వరదక్షిణకూడాయిచ్చి సీతమ్మను పెండ్లిచేసారు. పెండ్లి అయి సీతమ్మ కాపరానికివచ్చినప్పట్నుంచీ రామరావు యింతభూమి కాణీ, యిల్లు సంపాదించుకొని సుఖంగ కాలంగడుపుతూన్నాడు. సంతానంలేదనే కొఱత రామారావునుకూడా బాధిస్తూంది. అయితే భార్యతో యీవిషయం ఆలోచిస్తే తన్నేమనుకుంటుందో అని సిగ్గుపడేవాడు. సీతమ్మ నవనాగరపు పడుచు కాకున్నా అంత ఛాందసురాలుకూడా కాదు. భారత భాగవతాలపైన అభిరుచియెక్కువ, పూర్వాచారాలంటేకూడా.

సహవాససంబంధాన్నిబట్టి అప్పుడప్పుడు సినీమాలకు వెళ్లేది. పోయినా తెలుగుఫిల్ములకు అందులోనూ పౌరాణికఫిల్ములకే వెళ్లేది. భర్తపైన చాలాప్రీతీ అనురాగమూ. రామరావు సీతమ్మగార్ల ప్రేమానురాగాలు సీతారాములమాదిరి వుండేవి.

రామరావుకు ఆఫీసుండీవస్తూనే షికారువెళ్లేది వాడుక. షికారునుండీవస్తూనే భోజనంచేసి సీతమ్మతో తీరికగ కబుర్లుచెప్పకోనేవాడు. ఆనాడురాత్రి భోజనముచేసి పడకటింటిలో కుర్చీలోకూర్చొని "గృహలక్ష్మి"లోని శారదలేఖను చదువుతున్నాడు. సీతమ్మ కూడా తొందరగ భోజనంచేసి పనిపాట్లుతీర్చుకొని తాంబూలముతట్ట పాల గ్లాసుతీసుకొని గదిలో ప్రవేశించి తట్ట, గ్లాసును టేబిల్ మీదపెట్టి మంచాలమీద పరుపులు విదలించిపరిచి టేబిల్ దగ్గరకొచ్చి తమలపాకుల్లోని నారలుతీస్తూ నిలబడుకుంది. రామరావు లేఖను చదివిన తరువాత "సీతా! నేడు ఏదో ఒకరక ముగనున్నావే!" అని సీతమ్మ ముఖముపైపే చూస్తూ పుస్తకాన్ని టేబిల్ మీదపెట్టెను.

"ఏమిచెప్పేది! నలుగురిలోను తలవంపులైనట్లుంది బ్రతుకు!" అని ఆవలకుతిరిగి తమలపాకులకు సున్నము రాస్తూ నిలబడింది.

"అంతపని నేనేమైనా చేశానా! లేక ఎవరికైనా చేశామా! ఎప్పుడూ అనుకోని సంగతితెస్తున్నావే!"

"ఏమిలేదుకాని చాలదా యీ వంధ్యాత్వం."

"అందుకు—"

"అందుకు! అంటారు అందరు! ఏడేండ్లయింది దీనికి బిడ్డలుఅవుతారా అని."

"పోనీలే."

"మీకేమి మిమ్మెవరంటారు నన్నుకదా అనేది."

"ఇప్పుడేమంటావు మరి."

"మీరు ఇంకొక పెండ్లిచేసుకుంటే—"

"నీవా సమ్మతించేదానివి."

"నాచెల్లెలే ఉందికదా! చెల్లెలే గనుక యిద్దరు అన్యోన్యంగాఉంటాము, వేరేఅయితే నేనూ ఒప్పకోనే దాన్నేనా!"

"నీవు సమ్మతిస్తే అభ్యంతరమేమీలేదు."

"అయితే మావాళ్లకుకూడా వరుణ్ణి వెతికి వెతికి విసుగెత్తింది. ఎవరూలేకుంటే అక్కా మొగుడేగతి. నేనిప్పిస్తాను!"

సీతమ్మ చెల్లెలు జానకికి పెండ్లిఅయ్యేవేళకు పదహైదేండ్లుంటాయి. ఇన్నాళ్లు వరుడుదొరకక పిల్ల పెరిగింది. అక్కకంటే అందకత్తె. కొంతవరకూ యింగ్లీషు కూడా చదువుకుంది. నవనాగరకతలో అభిరుచి యెక్కువ. రామారావుకు యీకాలపుపిల్ల దొరకలేదనే కొఱతతీర్చింది. పెండ్లిఅయిన మూడునెలలకే నిషేకముకూడా అయింది. అక్కచెల్లెండ్రు చాలా అన్యోన్యంగాఉన్నారు. అక్కమాట చెల్లెలు జవదాటకుండా, చెల్లెలు నలపోలు అక్కతీసికొంటూ, భర్తకు చాలా ఆనందాన్నికలిగిస్తూన్నారు. రామరావు ఆఫీసుకార్యాలు చక్కబెట్టుకొని యింటికివస్తూనే షికారువెళ్లేది మానుకొని భార్యలతో ముచ్చట్లు జరుపుకుంటూ సుఖంగాఉండేవాడు.

ఇట్లానందిస్తూండగానే సీతమ్మనోమూ అభీష్టమూ ఫలించిందా అనేట్టు కొన్నాళ్లకు జానకి గర్భము ధరించింది. రామరావు సీతమ్మగార్లు ఆనందంలో పొంగిపోయారు. అయిదోనెలలోనే అత్తమామలను కావలసిన బంధువర్గాన్ని పిలించుకొని జానకికి సీమంతంచేయించింది సీతమ్మ. జానకి గర్భవతిగనుక పని పాట్లుచేయించకుండా సీతమ్మ అంతపనీ తానే చేసుకొనేది. అయితే యెంతచెల్లెలేఅయినా సీతమ్మ భర్త ప్రేమ పూర్తిగ చెల్లెలిపైనేపోనీకుండా తానూకూడా అప్పుడప్పుడు వంటచేస్తూఉన్నా, పనిపాట్లుచేస్తూఉన్నా గదిలోనికివచ్చిపోయీ రామరావు జానకి సంభాషణలలో అడ్డునవాలు చేస్తూండేది.

ఆదినము ఆదివారము. రామరావు యింటిలోనే వుండి గర్భిణీస్త్రీకోరికమీద ఆదినము పండుగచేసికొని భోజనంచేసి తీరికగకూర్చొని తాంబూలము సీతమ్మ మడిచియిస్తూంటే వేసుకుంటూ కబుర్లుచెప్ప

తూన్నాడు. జానకికూడా ప్రక్కనే తలక్రిందికి చేయి పెట్టుకొని పండుకొని తాంబూలము నములుతూ ఊకొట్టుతూంది. గర్భవతిఅవడముచేత ఊకొట్టుతూ, ఊకొట్టుతూనే అక్కడేనిద్రపోయింది. గర్భవతిగనుకనూ, పండుగభోజనంచేతనైన ఆయాసముచేతనూ బుస్సు బుస్సుఅని గొరకలుపెటుతూంటే ముఖమంతా చెమటలుపోసి, ఆ చామనిచాయముఖము తామరమీద నీటిబిందువులమాదిరి కనిపిస్తున్నాయి. కొంతసేపటికి ఆ చెమటబొట్లు ప్రవహించడానికి మొదలుపెట్టినాయి. రామరావు జానకి ముఖముతట్టుచూచి పడక కుర్చీనుండీ దిగివచ్చి "అయ్యో! నిద్రించుటకూడా గర్భవతులకు ఆయాసమూ - కష్టమూనా!" అని తన, ముఖములో ఆనందము అంకురిస్తూంటే పైనున్న వల్లెతో ప్రేమార్ద్రపుదృష్టులతో ముఖముతట్టు చూస్తూ చెమటనుతుడిచి అట్టే కొంచెసేపు విసరాడు.

ఈసన్నివేశం కొంతవరకూ సీతమ్మ హృదయములో అసూయాబీజములు నాటింది. ఎంత అక్కచెల్లెండ్రయినప్పటికీ - సవతులుకదా! అత్తకోడండ్రు - సవతులూ - సవతితల్లులూ - అసూయాగ్రస్తులేకదా! ఒకప్పుడుగాకుంటే ఒకప్పుడన్నా వారిమనసుల్లో ఈర్ష్యపుట్టకపోదు. ఓర్పుకలవాళ్లు కొంతవఱకు లక్ష్యంచేయరు. అదిలేనివాళ్లు ప్రతీకారాన్ని చేయవలెనని వెంటనే యోజిస్తారు. అనుకొన్నంతపని చేసే వరకు వారిమనస్సొప్పదు.

రామరావు జానకిముఖముపై చెమటనుతుడిచి నప్పట్నుంచి సీతమ్మకుపుట్టింది పుట్టరానితెగులు. "అపుత్రస్యగతిర్నాస్తి" అను పరలోకచింతపోయి "తనగతేమి" అనే యిహలోకచింత యెక్కువ బాధించింది. "కొడుకు కలగకనే యింత ప్రేమ పక్షపాతము చూపేవాడు కొడుకు కలిగితే యింకెంత జాస్తిచేస్తాడో, అప్పట్లో సవతితల్లి స్వంతతల్లి అవుతుందా! గొడ్రాలిమీద ప్రేమవుంటుందా ఆయనకు, పిల్లవాని ముచ్చట్లలో మురిసిపోయి పిల్లతల్లినే ప్రేమిస్తాడుకాని నన్ను మాట్లాడిస్తాడా! భర్తప్రేమనంతా తానే చూరగొన్నానని గర్వించి అది నన్ను దాసిగాచేస్తుంది. కాబట్టి యేదైనా గట్టిగ ఆలోచిస్తేనేగాని మార్గంలేదు" అని వితర్కించుకొని సీతమ్మ మనసులో ఆందోళన యెక్కువైపోయింది. గర్భస్థశిశువును అంతమొందిస్తేనేగాని మనశ్శాంతి కల్గేటట్టు లేదు. అందుకోసరము జానకికి బాధకలిగిస్తేనేగాని గర్భస్థశిశువు చావదు. తానుచేసేకార్యము యెవరికిన్ని తెలియకూడదు. పైగా భర్తమీద జానకిమీద యేకరీతిగ ప్రేమ అభినయిస్తూ ఉండవలెను.

ఆలోచనచేయగా చేయగా ఒకటితట్టింది. గర్భవిచ్ఛిత్తుచేసే ఔషధాలున్నాయని అప్పుడప్పుడు వినింది. అయితే అవి సీతమ్మకు దొరికేదెట్లా. ఎప్పుడూ ఒంటరిగా ఊరిలోనికిపోని సీతమ్మ ఆ దినము జానకి యింటిలోనిద్రపోతూంటే తెగించి, రామమ్మఅనే ఆవూళ్లోని వంటలక్కయింటికివెళ్లింది. రామమ్మ గర్భవిచ్ఛిత్తులకు మందులు విరుగుళ్లు తయారుచేసిపెట్టి గుట్టుగయిచ్చేదని పుకారు. తన చేతిలోని బంగారుగాజుతీసి రామమ్మచేతిలోపెట్టి సంగతంతా చెప్పుకొంది. రామమ్మ లోపలినుంచి ఏదో భస్మం మాదిరి పొడితెచ్చి సీతమ్మకుయిచ్చి "ఇది దేన్లోనయినాకలిపి నీసామర్థ్యంకొద్దీ తినిపించేయి" అని పంపివేసింది. సీతమ్మ యింటికొచ్చి మధ్యాహ్నం టిఫన్‌కుగాను లాడు చేసింది. మగడువచ్చేవేళకు పొద్దుపోతుందనిచెప్పి జానకికి రెండు లడ్డూలిచ్చి తినమనింది. దాన్లోకలిపేసింది రామమ్మ యిచ్చినమందు.

రాత్రి ఏడుగంటలప్పుడు జానకి భోజనమువద్దని ఓవల్టిన్ తాగి యీజీచేర్లోకూర్చొని యేమోచదువుకుంటూంది. సీతమ్మ యింటిలోపల వంటపని చేసుకుంటూంది. అప్పుడప్పుడూ జానకివైఖరి తొంగిచూస్తూంది. రామరావుకూడా షికారునుండివచ్చి డ్రెస్ తీసేసి

కాళ్లూచేతులూ కదుక్కొని సీతమ్మను మాట్లాడించి జానకియెదురుగ టేబిల్ వద్ద కుర్చీలోకూర్చొని కబుర్లు చెప్పడానికని "జానకీ" అని పిలిచాడు. ఆవేళకు రామమ్మయిచ్చినమందు పనిచేయడం ప్రారంభించింది. జానకీఅని పిలిచినపిలుపు రెండుమూడుమార్లు అనివా వినిపించుకోలేదు. రామరావు కుర్చీనుండీలేచి యీజీఛేర్ దగ్గరకొచ్చి తొంగిచూచాడు. పలకలేదు. జానకికి కండ్లు పైకిపోయినవి. కడుపులో నువట మెత్తింది. జానకీజానకీఅంటూ పొర్లించి పలకరించాడు రామరావు, పలుకలేదు. రామరావు దిక్కుతెలియక "సీతా" అని అరచాడు. ఆ అరుపువింటూనే సీతమ్మ ఉలికిపడిలేచి పరుగెత్తివచ్చింది. జానకి పడక కుర్చీనుండిలేచి యేమేమో సన్నిపాతరోగిమాదిరి వదురుతూ సంకటము, సంకటము, అని అరుస్తూ కడుపు గుద్దుకోవడం ప్రారంభించింది. సీతమ్మకూడా భర్తతోపాటి నిర్ఘాంతపోయి చూస్తూంది. ఒకరితోఒకరు మాట్లాడకుండా అట్లేచూస్తున్నారు. "అయ్యో! ఇంకేమిగతి అన్యాయము, అన్యాయము" అని అప్రయత్నంగా సీతమ్మనోటినుండి మాటలువస్తున్నాయి. రామరావు యేమితోచక కొయ్యవలె నిలబడిపోయినాడు. ఇంతకు ముందెప్పుడు కనివినిఎరుగని జానకిబాధ తనకేమియు బోధపడడములేదు. చికిత్సచేయడానికి చేయించడానికి తోచలేదు. సీతమ్మమాత్రం తొందరగ యింత పానకంచేసి నిమ్మపండుపిండి యిచ్చింది. బాధ తగ్గడంలేదు కాని హెచ్చింది. ప్రాణి గిజగిజ తన్నుకొంటూంది.

ఈదృశ్యాన్ని చూసేవేళకు సీతమ్మ మనోవైఖరి మారింది. పశ్చాత్తాపం ప్రారంభమయింది. తన అకృత్యాన్ని లోలోన నిందించుకుంది. సహోదరికదా! ఏకోదరత్వ సంబంధమూ అనురాగమూ యెన్నటికైనా పోతుందా. ఇంతకూ సీతమ్మకుపుట్టిన అసూయ అనాదిగ సంప్రాప్తించింది కాదు. స్వల్పకాలంలోనే పుట్టి కార్యరూపందాల్చింది. జానకిపడే అవస్థలుచూచి సహించలేకపోయింది. "ఇదేమో గ్రహసంబంధమున్నట్టుంది మంత్రమున్నా వేయించుకొస్తా" అని రామరావుతో చెప్పిన దవసరం బిరబిర బజారులోపడి అతివేగంగా రామమ్మయిల్లుచేరింది. సీతమ్మతన రెండో చేతులోని గాజుపీకి రామమ్మ చేతిలోపెట్టి "అమ్మా నీపుణ్యము అవస్థచూడలేనమ్మా. పథ్య నీమందుకు విరుగుడయిస్తే నీపుణ్యము" అని దీనంగా ప్రార్థించింది. రామమ్మ తనఅదృష్టానికి సంతోషిస్తూ లోపలినుంచీ మరొకపొట్లము తెచ్చి "దీన్ని నీళ్లలోకలిపి త్రాగించు" అని యిచ్చింది. సీతమ్మ యింటికివచ్చి మందుపొట్లము నీళ్లలోవేసి మంత్రమునీళ్లని తాగించింది. కొంచెముసేపటికి జానకిశరీరమంతా చెమట్లుపోసి ఉస్సూరుమనింది. అట్లే కొంచెంకొంచెం తగ్గుతూవచ్చింది. సీతమ్మప్రాణం కొంతకుదుటపడింది. వెంటనే వంటింట్లోకిపోయి స్టవ్వులో వేడిగ ఓవల్టిన్ చేసియిచ్చింది. జానకి కొంచెంతాగి "అబ్బా" అని కొంచెంసేపు అట్లేనిద్రపోయింది. నిద్రనుండిలేవగానే సీతమ్మ వేడినీళ్లతోస్నానంచేయించి భోజనంపెట్టింది. అప్పటికి బాధ ఉపశమించింది. తాము భోజనం చేసారు.

అప్పట్నుంచీ సీతమ్మహృదయంలో దురభిప్రాయాలకుగాని రామరావుపై ప్రేమ పక్షపాతాన్ని ఆరోపించడమును కాని లేకుండా కాలముగడుస్తూ ఉంది. ఒకనాడు రామరావు భోజనముచేసి పడక కుర్చీలో కూర్చొనిఉండగ కుర్చీప్రక్కన సీతమ్మ కూర్చొని ఆకులు మడతపెట్టియిస్తూంది. హఠాత్తుగ రామరావుకు ఆకు అందిస్తూన్న చేతివైపు దృష్టిమళ్లింది "సీతా గాజుల్లో ఒకటిలేదే" అని ప్రశ్నించాడు. "అకస్మాత్తుగ ఒకటివిరిగిపోయింది దాన్నితీసి పెట్లో పెట్టినాను" అని బదులుచెప్పింది. "సరే" అని రామరావు యేవోమాటలు అరంభించాడు.

ఆదినం మూడోశనివారము – శలవు. రామరావు యింటిలోనే ఉన్నాడు. ఏదోజ్ఞాపకంవచ్చి

"సీతా నీవిరిగిపోయినగాజు యిక్కడతీసుకొనిరా! ఖరీచేయించుకోవస్తాను ఈదినం శెలవు తీరికఉంది" అని సీతమ్మనుపిలిచిఅడిగాడు. సీతమ్మ యీతూరి శోక కారణం చెప్పి తప్పించుకోలేకపోయింది. సీతమ్మ తనఅకృత్యాన్ని మగనితో చెప్పవలెనని యెన్నోసార్లుప్రయత్నించి నోరుగురక ఊరకుంది. ఇప్పుడు భర్తకు ప్రత్యుత్తరమిచ్చేందుకు తోచక దిక్కుంది. భోరునఏడ్చింది. రామరావు కేమిన్ని అర్థంకాలేదు. జానకినవ్వా అడుగుదామంటే గదిలోపండుకొంది. సీతమ్మ రెండుచేతుల్లోను ముఖం దాచుకొని రామరావుఒళ్లోపడి యేడుస్తోంది. తల యెత్తి రామరావు శోకకారణాన్ని ప్రశ్నించాడు. రామరావు తనవళ్లెలో సీతమ్మ కన్నీళ్లుతుడుస్తూంటే మొదలుపెట్టింది కథ. ఆద్యంతము పూసగుచ్చినట్లు తన అకృత్యాన్నిగురించి చెప్పింది. "క్షమించరా" అని వేడుకుంది.

"అంతయు స్వయంకృతాపరాధమే" అనివవ్వుతూ "ఆదినం నీవు కొంచెము ఆలస్యంచేసివుంటే యేమై ఉండునో తెలిసిందా, క్షమించితిని లెమ్మ" అని రామరావు చేరదీసాడు.

ఇంతలో నిద్రనుండిమేల్కొని వచ్చిన జానకిని చూచి అక్కసంగతంతా చెప్పేవేళకు జానకికూడా ఘక్కునవవ్వి "స్వయకృతాపరాధమే కదా!" అని రామరావుఅనినదానికే సమర్థించింది. సీతమ్మ అవమానంతో తలవంచుకొని కాలిబొటనవేలితో నేల రాచింది.

—:o:—

చందమామ

కల్లబొల్లి మాటలాడితె
ఒళ్లుమరచే వెర్రిబాగుల
చందమామా! నిన్నుజూస్తే
జాలివేస్తుందీ!!

"ఎందుఎరుగని అందగాడవు
చందమామా భేషు!" అంటూ
దొంగకవులూ పొగడిపోస్తే
పొంగిపోతావా?

కడలిబాబాయ్ కనికరించిన
తీపిపంటల వేనవేల
దొంగకవులా దోచుకుంటూ
దొరలనిస్తావా?

'చెలిమిచేస్తా'నంటు జేరే
చిలిపికవులకు మోసపోయీ
దొప్పదోగగ దోరవెన్నెల
దోచిపెడతావా?

దోచుకొన్నా దొంగసొమ్మును
దొరలలాగా మ్రింగుతుంటే
ఊటలూరే కోటినాల్కల
లొట్టలేస్తావా?

పడకటింటీ ఉడుకునంతా
పైనరుద్దీ తిట్టిపోసే
దొంగకవులా దోషమంతా
తోసివేస్తావా?

కల్లబొల్లి మాటలాడితె
ఒళ్లుమరచే వెర్రిబాగుల
చందమామా! నిన్నుజూస్తే
జాలివేస్తుందీ!!

పినపాల వేంకటేశ్వరరావు.